సాక్షి
నిజామాబాద్
7


ఆదివారం । 30 । మార్చి । 2025



జాన్కంపేటలో భక్తుల సందడి

శనివారం అమావాస్య సందర్భంగా లక్ష్మీ నరసింహా స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

- 10లో ▸



వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 41.5 /21.1

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఈదురుగాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

క్రమశిక్షణతో మెలగాలి



ఖలీల్‌వాడి: క్రమశిక్షణతో మెలగాలని పోలీసు సిబ్బందికి సీపీ పోతరాజు సాయిచైతన్య సూచించారు. ఏఆర్, హోంగార్డ్స్‌లో పని చేస్తున్న పురుషులు, మహిళల సమస్యలను తెలుసుకునేందుకు జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం దర్బార్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీ సిబ్బంది ఉన్న సమస్యలను తెలుసుకుని వారి సందేహాలను నివృత్తి చేస్తూ బాగోగులు అడిగి తెలుసుకున్నారు. సత్వర చర్యలకు ఉత్తర్వులు జారీ చేశారు. సిబ్బందికి ఎప్పుడు, ఎలాంటి సమస్యలు వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) బస్వారెడ్డి, రిజర్వ్ సీఐ సతీశ్ (హోం గార్డ్స్), తిరుపతి (అడ్మిన్), ఆర్‌ఎస్సైలు శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, దేవీసింగ్, శేషారావు, దత్తు, ఆఫీస్ సూపరింటెండెంట్లు శంకర, బషీర్ అహ్మద్, వనజరాణి, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు షకీల్ పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి హెల్ప్‌లైన్

సుభాష్‌నగర్: విద్యుత్ సరఫరాలో అవాంతరాలు ఏర్పడినా, మెరుగైన, నాణ్యమైన సేవలకోసం వినియోగదారులు హెల్ప్‌లైన్ నంబర్ 1912ను సంప్రదించాలని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ రాపెల్లి రవీందర్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. 1912 నంబర్ 24 గంటలూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. విద్యుత్ సమస్యలన్నింటికీ ఈ నెంబర్ పరిష్కారం చూపుతుందని, కార్పొరేట్ కార్యాలయం నుంచి సేవలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్, సరఫరాలో ఇబ్బందులు, బిల్లుల్లో హెచ్చుతగ్గులు, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్, విద్యుత్ మీటర్ల మార్పు, కొత్త సర్వీసుల మంజూరుకు సంబంధించి పేరు మార్పు, కేటగిరి మార్పు, లోడ్ మార్పు, తదితర సమస్యల కోసం టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించి సేవలు పొందొచ్చన్నారు. వినియోగదారులు 1912కు ఫోన్ చేయగానే స్వీకరించి, ఫిర్యాదును నమోదు చేసుకుంటారని, ఆ సమాచారం సంబంధిత అధికారికి వెళ్తుందని పేర్కొన్నారు. అదేసమయంలో ఫిర్యాదుదారుడికి మెసేజ్ రూపంలో సమాచారం వస్తుందని, ఆ ఫిర్యాదు అధికారి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటారని తెలిపారు. 1912పై వచ్చిన ఫిర్యాదులను ఉన్నతస్థాయి అధికారులు సమీక్షిస్తారని, రైతులు విద్యుత్ సంబంధిత పనులు చేయొద్దని, విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. సమస్యను అధికారులకు తెలియజేస్తే.. వారే వచ్చి పరిష్కరిస్తారని తెలిపారు. ప్రతిఒక్క వినియోగదారుడు టోల్ ఫ్రీ నంబర్ గుర్తుపెట్టుకునేలా విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని ఎస్ఈ తెలిపారు.



కొత్త ఆశల విశ్వావసు

నేడు ఉగాది ▪ ఇళ్లు, ఆలయాల్లో పూజలకు ఏర్పాట్లు ▪ అలరించనున్న పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనాలు



ఉగాది పండుగ.. కవితల వెల్లువ 8లో..

విశ్వావసు కొత్త ఆశలను మోసుకొచ్చింది. శిశిరంలో ఆకులు రాల్చిన వృక్షాలు కొత్త చివుర్లు తొడుక్కొని పచ్చగా మెరిసిపోతుండగా.. చిగురించిన ఆశలతో నూతన సంవత్సరానికి షడ్రుచులతో స్వాగతం పలికేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. కవులు కందువాలు సర్దేసుకుంటూ హడావుడి చేస్తుండగా, పంతులుగారి పంచాంగ శ్రవణం ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నాడు సామాన్యుడు. ఉగాది పండుగను పల్లె, పట్నం అంతటా వేడుకగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. అలాగే జిల్లాలోని పలు ప్రాంతాల్లో కుస్తీపోటీలు, జడ కొప్పుల ఆట నిర్వహించనున్నారు. విశ్వావసు నామ సంవత్సరం కొత్తదనాన్ని తీసుకురావడమే కాకుండా అందరి జీవితాల్లోనూ కొత్త ఆశలు చిగురింప జేసి కోటి కోరికలు పూవులై విరబూయాలని ఆశిద్దాం. – నిజామాబాద్ రూరల్



విక్రయానికి సిద్ధంగా ఉన్న మట్టి కుండలు, పాత్రలు



నిజామాబాద్ నగరంలో మామిడికొమ్మలు, వేపపూవు విక్రయాలు

డాక్టర్ జీ జన్మదినం స్వయం సేవకులకు పర్వదినం

- ఉగాది రోజున జన్మించిన ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకులు హెడ్గేవార్
- కందకుర్తిలో వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: దేశ అస్తిత్వం, సంస్కృతి, సంప్రదాయాలను నిలబెట్టేందుకు నిరంతరం కృషి చేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్‌ను స్థాపించిన డాక్టర్ కేశవ బలిరామ్‌పంత్ హెడ్గేవార్ జన్మించింది ఉగాది రోజునే. విశ్వావసు నామ ఉగాది పర్వదినాన షడ్రుచుల సమ్మేళనంతో చేసిన పచ్చడి తినడంతో పాటు హెడ్గేవార్ జన్మదినం నిర్వహించుకోవడం జిల్లాకు మాత్రమే ప్రత్యేకమని స్వయం సేవక్‌లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. హెడ్గేవార్‌జీ పూర్వీకులు ఇందూరు జిల్లాలోని రెంజల్ మండలం కందకుర్తి నుంచి నాగ్‌పూర్‌కు వలస వెళ్లారు. కందకుర్తిలో హెడ్గేవార్ పూర్వీకుల ఇంటి స్థానంలో ఆయన స్మృతి మందిరం నిర్మిస్తున్నారు. హెడ్గేవార్‌జీ నేపథ్యం కందకుర్తి నుంచే కావడంతో జిల్లా ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విజయదశమి రోజున కొద్దిమంది చిన్నారులతో హెడ్గేవార్‌జీ ప్రారంభించిన ఆర్‌ఎస్‌ఎస్ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థగా విరాజిల్లుతోంది. జిల్లా కేంద్రం, కందకుర్తితోపాటు అన్ని మండలాల్లో ఆదివారం సర్వ కుటుంబాలను ఆహ్వానిస్తూ ఉగాది వేడుకలను నిర్వహించేందుకు ఆర్‌ఎస్‌ఎస్ అన్ని ఏర్పాట్లు చేసింది.


ఉగాది కుండ

- పండుగ పచ్చడితో మొదలుపెట్టి ఏడాది మొత్తం వాడకం
- సనాతన సంప్రదాయంలో కుండకు ఎనలేని ప్రాధాన్యత
- కోవిడ్ తర్వాత కుండలకు పెరిగిన డిమాండ్



ఆరోగ్యప్రదాయినిగా తిరుగులేని పాత్ర పోషిస్తున్న మట్టి కుండలకు రానురాను మరింత డిమాండ్ పెరుగుతోంది. భారతీయ సనాతన సంప్రదాయంలో అనాదికాలం నుంచి మనిషి జీవనవిధానంతో ముడిపడిన కుండలను ప్రతిఒక్కరూ ఉగాది పర్వదినం రోజు కొనుగోలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇలా కొనే కుండలను పచ్చడి కుండ, ఉగాది కొత్త కుండ అని పిలుచుకుంటారు. ఈ పర్వదినం రోజు కొనుగోలు చేసిన కుండల్లోనే ఉగాది పచ్చడిని తయారు చేస్తారు. ఈ కుండలో షడ్రుచుల పచ్చడి తిన్న తరువాత తాగునీరు పోసుకోవడం, వంట చేసుకోవడం, పాలు, పెరుగు పెట్టుకోవడం కోసం ఏడాది మొత్తం ఉపయోగించుకుంటారు. మళ్లీ కొత్త సంవత్సరాది వచ్చేవరకు ఈ కుండలను ఉపయోగిస్తారు. – సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

తయారీకి ఐదు రోజులు!



మాట్లాడుకున్నంత తేలిక కాదు కుండల తయారీ. ఒండ్రు (బంక) కలిగిన మట్టిని సేకరించి పసుపు పొడి మాదిరిగా సన్నగా జల్లెడ పట్టుకోవాలి. ఆ సన్నని మట్టిని తడిపి చేతులతో ముద్దలు చేసుకోవాలి. ఆపై బరువైన చక్రం మీద మధ్యభాగంలో మట్టిని పెట్టి గిరగిరా తిప్పుతూ అత్యంత నైపుణ్యంతో చేతులతో తయారు చేయాల్సి ఉంటుంది. తయారు చేసిన మట్టి కుండలు, పాత్రలను ముందు ఎండలో, ఆ తరువాత నీడలో ఆరబెట్టాలి. తరువాత బట్టి ఏర్పాటు చేసి కాల్చడం వరకు తయారీకి కనీసం ఐదు రోజుల సమయం పడుతుంది.



బట్టి ఏర్పాటు చేసి కుండలను కాలుస్తున్న దృశ్యం

ఆయుష్షు పెంచే శక్తి..

కుండలోని నీరు, ఆహారం శ్రేయస్కరమనేది జగమెరిగిన సత్యం. పుట్టిన ప్రతి జీవికి ఆహారం అందిచేది నేల తల్లి. అలాంటి నేలతల్లి నుంచి సేకరించిన ఒండ్రు మట్టితో తయారు చేసిన కుండలకు ఆయుష్షును సైతం పెంచే శక్తి ఉంది. కోవిడ్ తరువాత కుండల వాడకం పెరుగుతూ వస్తోంది. వివాహాలు, బోనాలు, వ్రతాలు, యజ్ఞయాగాలు, క్రతువులు, దైవకార్యాలు, ఆలయాల్లో వాడకం, వాణిజ్య అవసరాలు (కుండ బిర్యానీ) తదితరాల కోసం కుండల వాడకం పెరుగుతోంది.

50 కుటుంబాలు ఉన్నాయి



నగరంలో 200 కుటుంబాలు గతంలో కుండలు తయారుచేసేవి. ప్రస్తుతం 50 కుటుంబాలు మాత్రమే ఈ వృత్తిలో ఉన్నాయి. కరోనా తరువాత నుంచి మట్టి కుండలు, పాత్రల వాడకం పెరిగింది. ఆయుష్షును పెంచే మట్టి కుండల ప్రాధాన్యాన్ని గుర్తించిన చాలామంది మట్టి బాటిల్స్ తయారు చేయించుకుంటున్నారు. ప్రస్తుతం కులమతాలతో సంబంధం లేకుండా అందరూ మట్టి పాత్రల వాడకానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

– ఆర్మూర్ చిన్నసాయిలు, కుమ్మరి

'రాజీవ్ యువ వికాస్' పెద్ద మోసం

- వాగ్దానాల విస్మరణ కాంగ్రెస్ డీఎన్ఏలో ఉంది
- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



సుభాష్‌నగర్: రాజీవ్ యువవికాస్ పథకం పెద్ద మోసమని, డిక్లరేషన్ల వైపు నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే ఈ పథకాన్ని తెరపైకి తీసుకొచ్చారని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ విమర్శించారు. వాగ్దానాలను విస్మరించే నైజం కాంగ్రెస్ డీఎన్ఏలోనే ఉందన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హామీలన్నింటినీ చెత్తబుట్టలో వేసి, 16 నెలలుగా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నా రు. గృహజ్యోతి వెలుగులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పింఛన్, యువ వికాసం, మహాలక్ష్మీ, ఇతర పథకాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా అంకెల గారడితో మోసానికి పాల్పడుతోందన్నారు. సమావేశంలో ప్రధానకార్యదర్శి న్యాలం రాజు, ఉపాధ్యక్షుడు నాగోళ్ల లక్ష్మీనారాయణ, నాయకులు తారక్ వేణు, గడ్డం రాజు, ఆనంద్‌రావు, నాగరాజు, మాస్టర్ శంకర్, బట్టు రాఘవేందర్, కిశోర్, పంచరెడ్డి శ్రీధర్, ప్రభాకర్, సాయివర్ధన్, ముత్యాలు, ఆయా మోర్చాల నాయకులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : బీసీ రిజర్వేషన్లు అమలయ్యేదాకా పోరాడుదామని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో శనివారం కామారెడ్డిలో బీసీ కుల సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కవిత మాట్లాడుతూ.. కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీల జనాభా 52 శాతం అని తేలిందని, కాంగ్రెస్ చేసిన కుల సర్వే ద్వారా బీసీల జనాభా తగ్గించి, ఓసీల జనాభాను పెంచారని పేర్కొన్నారు. 'కామారెడ్డి డిక్లరేషన్'ను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. బీసీ బిల్లులు ఆమోదం పొందేలా బీజేపీ నాయకులు కేంద్రంపై ఒత్తిడి తేవాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, టీఎస్పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్, అయాచితం శ్రీధర్, సంపత్‌గౌడ్, నాయకులు బాజిరెడ్డి జగన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకే సగం సెంటర్లు

- ఎస్‌హెచ్‌జీలకు ధాన్యం కొనుగోళ్ల బాధ్యతలు
- జిల్లాలో 336 కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం
- త్వరలో అవగాహన కల్పించనున్న ఐకేపీ అధికారులు



ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి (ఫైల్)

డొంకేశ్వర్(ఆర్మూర్): స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలతో ధాన్యం కొనుగోళ్లు కూడా చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో జిల్లా ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు ప్రారంభించారు. యాసంగి సీజన్‌లో రైతులు పండించిన వడ్లను ఎస్‌హెచ్‌జీ గ్రూపులే కొనుగోలు చేసి ఇచ్చేలా కార్యాచరణ రూపొందించారు. అందులో భాగంగా ఇటీవల కలెక్టర్ అధ్యక్షతన ఐకేపీ అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. గతంలో మహిళా సంఘాలతో 67 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని సేకరించేవారు. ఏడాదికి దాదాపు రూ.4 కోట్ల వరకు ఆదాయం వచ్చేది. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల సంఖ్యను 336కు పెంచాలని అధికారులు నిర్ణయించారు. దీంతో జిల్లాలో ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో సగం వరకు ఎస్‌హెచ్‌జీలవే ఉండనున్నాయి. సీజన్‌కు రూ.5 కోట్ల వరకు కమీషన్ వచ్చే అవకాశం ఉన్నట్లు ఐకేపీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఎస్‌హెచ్‌జీలు కొనుగోళ్లను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఐకేపీ శాఖకు బాధ్యతలు అప్పగించారు. డీఆర్డీవోతో పాటు ఒక ఏపీడీ, డీపీఎం జిల్లా స్థాయిలో పర్యవేక్షించనున్నారు. మండల స్థాయిలో ఏపీఎంలు, సీసీలు కొనుగోళ్లు సక్రమంగా జరిగేలా చూడనున్నారు. ఇటీవల ఏపీఎంలతో సన్నాహక సమావేశం నిర్వహించిన ఐకేపీ ఉన్నతాధికారులు త్వరలోనే సీసీల ద్వారా మహిళా సంఘాలకు ధాన్యం సేకరణపై అవగాహన కల్పించనున్నారు. ఏ మండలంలో ఎన్ని కేంద్రాలు ఏర్పాటు చేయాలో ఇప్పటికే ఓ నిర్ణయానికి రాగా, మార్పులు చేర్పులను పరిశీలిస్తున్నారు. ఎస్‌హెచ్‌జీ గ్రూపులు ఇప్పటికే స్కూల్ పిల్లల యూనిఫాంలు కుట్టడం, సోలార్ విద్యుత్ ప్లాంట్లు, మహిళా శక్తి క్యాంటీన్లు, ఆర్టీసీ అద్దె బస్సులు, పెట్రోల్ బంకులు వంటి రంగాల్లో రాణిస్తున్నాయి.

సమర్థవంతంగా నిర్వహిస్తాం

మహిళా సంఘాల ద్వారా జిల్లాలో సగానికి పైగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఎస్‌హెచ్‌జీలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు ఇదొక మంచి అవకాశం. కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తాం.

– సాయాగౌడ్, డీఆర్డీవో

క్లుప్తంగా

శుభాలు చేకూర్చాలి



నిజామాబాద్‌అర్బన్: జిల్లా ప్రజలకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. విశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలందరికీ శుభాలు చేకూరాలన్నారు. ఉగాది పండుగను ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని తెలిపారు. కొత్త సంవత్సరంలో జిల్లా మరింత ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు.

సుఖశాంతులతో ఉండాలి : సీపీ



ఖలీల్‌వాడి: జిల్లా ప్రజలకు విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా సీపీ పోతరాజు సాయిచైతన్య శనివారం శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు ఎలాంటి అభద్రతాభావం లేకుండా సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు.

అందరికీ మంచి జరగాలి: ఎమ్మెల్యే

వేల్పూర్: మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి జిల్లా ప్రజలకు శనివారం ఒక ప్రకటనలో తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. విశ్వావసు నామ సంవత్సరంలో అంతా మంచే జరగాలని, ప్రజలందరి జీవితాల్లో సరికొత్త ఆశలు చిగురించాలని ఆకాంక్షించారు.

పంచాంగ గ్రంథాల పంపిణీ



ఎమ్మెల్యే ధన్‌పాల్‌కు పంచాంగ గ్రంథాలను అందజేస్తున్న జ్ఞానేందర్ గుప్తా

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: విశ్వావసు నామ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఇందూరు నగరానికి చెందిన మంచాల శంకరయ్య గుప్తా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జ్ఞానేందర్ గుప్తా పంచాంగ గ్రంథాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. శనివారం పంచాంగం పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించా రు. జ్ఞానేందర్ గుప్తా ఆధ్వర్యంలో నగరంలోని అమ్మ వెంచర్‌లో శ్రీ వారాహి మాత ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారాహి అమ్మవారి అంశతో గ్రంథాలు చేయించినట్లు జ్ఞానేందర్ గుప్తా తెలిపారు. అవసరమైన వారికి ఈ గ్రంథాలను పంపిణీ చేస్తామన్నారు.

కాలజ్ఞానం

కార్యసాధకునికి కాలం ప్రియ ప్రేయసి
కర్తవ్య రహితునికి కాలం గాఢ తామసి
కాలక్షణం మనిషి కణం ఎంతో విలువైనవి
కాల పాలకుని ప్రస్థానం స్వర్గాదపీ గరీయసి
నేర్పిందా గడిచిన కాలం గుణపాఠం
వదిలిందా పుట్టుకతో వచ్చిన హఠం
బెత్తం వాడని మహాగురువు కాలం
తెలిసిందా నీవు కూర్చున్న నిజపీఠం
కాలాన్ని గమనిస్తే సోమరితనం దూరం
కాలంతో ప్రవహిస్తే సస్యశ్యామల తీరం
కాలం అందరికీ అయాచిత నేస్తమే
కాలాన్ని తిట్టుకోవడం అసహాయ స్వరం

రచన: ఘనపురం దేవేందర్, తెలుగు ఉపాధ్యాయుడు, సారంగాపూర్



ఉగాది పండుగ.. కవితల వెల్లువ

నిజామాబాద్ సిటీ: ఉగాది పర్వదినం సందర్భంగా "సాక్షి" దినపత్రిక పాఠకుల నుంచి కవితలను ఆహ్వానించింది. రెండ్రోజుల్లో 48 మంది బాల కవులు, యువ కవులు, ప్రసిద్ధ కవులు తమ కవితలను పంపారు. ప్రముఖ కవి, రచయిత, తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ కాసర్ల నరేశ్‌రావు న్యాయనిర్ణేతగా వ్యవహరించి కవితలను ఎంపిక చేశారు. స్థలాభావంతో వాటిలో నుంచి కొన్ని కవితలను మాత్రమే ప్రచురణకు స్వీకరించాం. మా ఆహ్వానానికి స్పందించి, కవితలు పంపిన కవులకు ధన్యవాదాలు. సాక్షి పత్రికపై ఇదే ఆదరణను చూపిస్తారని భావిస్తూ..

అదీ అసలు ఉగాది

గోడకు కొట్టిన మేకు పాతదే
క్యాలెండర్ కొత్తది
గూడు పాతదే
గూట్లోని పంచాంగం కొత్తది
కాలాలు మారినా
ఇంకా మారనిది మనమే
మనమే మారాలి
మన మనసులు మారాలి
మానవాళికి ఆనాడే
చైత్ర చైతన్యం

రచయిత: వీపీ చందన్‌రావు, కవి, నిజామాబాద్.



తెలుగు వత్సరాది ఉగాది

తెలుగు వత్సరాది ఉగాదికి
స్వాగతం సుస్వాగతం
చేదు అనుభవాలకు
అనుబంధం పూత పూస్తూ
పుల్లదనానికి కమ్మదనాన్ని చేరుస్తూ
కారానికి మమకారం పరుస్తూ
వగరు వక్రీకరణకు
ఆప్యాయత అర్థం చూపిస్తూ
తీపిదనాన్ని మాటల
మధురిమతో పంచుకుంటూ
ఉగాది లక్ష్మిని స్వాగతిద్దాం
విశ్వావసు నామ సంవత్సర
ఆనందాన్ని ఆస్వాదిద్దాం
తెలుగు వత్సరాది ఉగాదికి
స్వాగతం సుస్వాగతం

రచన: జి.అభిలాష్ శర్మ (ఇంటర్), సుభాష్‌నగర్, ఇందూరు



ఒట్టేసుకుందాం

ఉగాదులెన్ని వొచ్చినా
తగాదాల తలుపులు తెరిచే ఉన్నాయి
వసంతాలెన్ని వచ్చినా
వర్గ తగాదాలు అలాగే ఉన్నాయి
పాలకులెందరు మారినా
ప్రజల వ్యథలలాగే ఉన్నవి
సంస్కరణలు ఎన్ని చేసినా
సామాన్యుడి రాతలలాగే ఉన్నవి
ఋతువులెన్ని మారినా
ఋజుమార్గమే దొరకనప్పుడు
వసంతాలెన్ని ఒస్తేనేం
వావివరుసల విలువ లేనప్పుడు
తరాలు ఎన్ని మారితేనేం
మన తలరాతలు మారనప్పుడు
నీతులెన్ని చెప్పితేనేం
అవినీతి మాయమవ్వనప్పుడు
అందుకే కనీసం ఈ ఉగాదికైనా
మార్పు రావాలని
మనమందరం
మానవీయులవ్వాలని ఒట్టేసుకుందాం

రచన: దారం గంగాధర్, నిజామాబాద్



పిల్లల పండుగ

పిల్లలకు ఉగాది సంబరం
నువ్వుల బొబ్బట్లు
రవ్వ లడ్డూలు, నువ్వుల ఉండలు,
పిల్లలకు సంబరమే సంబరం !
మామిడి తోరణాలు మంగళహారతులు
ఇంట్లో అమ్మ నాన్న సంబరాలు
ఊరిలో పెద్దల వైభవాలు..
ప్రతి ఇంటికి ఉగాది అందాలు
ఇంట్లో బలమయ్యే బంధాలు..
కోకిల గొంతులో తీయదనం
అమ్మ చేతి కమ్మదనం ఈ ఉగాది!

రచన: కృతిక (7వ తరగతి), జెడ్పీహెచ్ఎస్, సిర్పూర్



ఉగాది మహిమ

ఉగాది వచ్చింది.
ఉత్సాహం తెచ్చింది.
కొత్త సంవత్సరపు వెలుగులు నింపింది.
షడ్రుచులతో పచ్చడిని పంచి.
జీవిత గమనం అర్థం తెలుపుతుంది.
మామిడి తోరణం శోభను పెంచి.
మంగళకరమైన ఆశలు నింపుతుంది.
నూతన ఉత్సాహంతో ముందుకు సాగుతూ.
సంతోష ప్రపంచాన్ని
ఆవిష్కరిస్తుంది.

రచన: సైని కార్తిక్ (9వ తరగతి), జెడ్పీహెచ్ఎస్, బోర్గాం



ఎదురుచూపులు

ప్రకృతిశోభతో హొయలు పోతున్న
ఉగాది ప్రకృతి కాంత సిగ్గుతో చెక్కిళ్ళకు
పుప్పొడి గంధాలు అద్దుకొని
నవ వసంతుడి రాకకోసంఎదురుచూస్తూ
ఇలా అందట ఓ వసంతుడా
ఏ విదూరసుదూర తీరాల
కాలం నుండి వస్తున్నావోనాకైతే,
తెలియదుకాని నను ఉక్కిరి బిక్కిరి చేస్తుంటే
హరివిల్లువనంలో ఆకుపచ్చని
ఆశనై నీకు స్వాగతం పలకాలని
సుదూర పొలిమేరల్లో నిలబడి
మనసుపూలనుమౌనంగాదోసిట్లో
పట్టుకుని నీకోసంవేచిఉన్నాను
మరి ఇంతటి ప్రకృతి ఆనందాన్నిస్తూ
వసంతుడితో జతకలిసి వస్తున్న
విశ్వావసు నామ ఉగాది కాంతను
మనమూ స్వాగతించేద్దామా!

రచన: టి.వసంతాలక్ష్మణ్, నిజామాబాద్



ఉషస్సులు తెచ్చే..

ఉగాది పండుగ వచ్చే, ఉషస్సులు తెచ్చే
కొత్త చిగుర్లు తొడిగే, కోయిలమ్మ పాడే
షడ్రుచుల పచ్చడి, జీవిత సారం తెలిపే
వేప పువ్వు చేదు, రేపటి తీపికి దారి చూపే
పంచాంగ శ్రవణం, భవిష్యత్తును తెలిపే
నూతన సంవత్సరము, ఆనందమును నింపే
ప్రతి ఇంటా సందడి, బంధువుల రాకతో
సంబురాల వేడుక, సంతోషాల నృత్యం
శుభారంభం ఇదిగో, విజయానికి బాటలు వేసే,
ఉగాది శుభాకాంక్షలు!
అందరికీ శుభాలు కలిగే

రచన: ఎన్.హర్షశ్రీ (7వ తరగతి), విజయ్ హైస్కూల్, ముబారక్‌నగర్.



వచ్చిందోయ్

వచ్చిందండోయ్ తెలుగు పండుగ
దీనిముందు ఆంగ్ల వత్సరం దండుగ
కోకిల కూతలు
వనాల సంతోషాలు పుల్లటి చింత.
తీయని బెల్లం.
వగరు మామిడి. చేదువేప.
కలిసిన పచ్చడి అద్భుతం.
ఆశలు వెలుగుతున్న జనాలలో కళకళ..
సంవత్సరానికి ఒకసారి వచ్చేదే ఉగాది
ప్రజల గుండెల్లో ఇది ఒక
తీయని కాంతుల పునాది
ఇది. నాది. నీది. మనది!

రచన: ఎం.మాధురి, (9వ తరగతి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సిర్పూర్



నవకాల ఆనందాల స్వాగతాది

అసలు పేరు 'యుగాది'..
చైత్రమాసాది
నూతన సంవత్సరాది..
మానవాళికి నవశకాది
పంచాంగ శ్రవణాది..
ఆదాయ వ్యయాల వివరణాది
షడ్రుచుల సంగమాది..
భావి జీవితంపై ఆశావాది
నవ నూతన ప్రభాకరాది..
ఇంటి ముందర రంగవల్లులాది
గుమ్మానికి మామిడి తోరణాది..
గడపకు పసుపు కుంకుమాది
తల స్నానాలతో పరిశుభ్రాది..
కొత్త బట్టలతో ఉందాది
దేవాలయాల్లో భక్తుల సంబరాది..
ఆంజనేయ స్వామి దర్శనాది
ప్రసాదాల పంపకాది..
గతకాల కష్టాల మరుపాది
నవకాల ఆనందాల
స్వాగతాది ఉగాది

రచన: విట్టం ధనంజయ, కలం పేరు: జాహ్నవి నిజామాబాద్



పసిడి కలల పంచాంగం..!

ఎగాదిగా చూస్తావెందుకు
ఉగాదిగా నే వస్తున్న
అనాదిగా మీ ఆశల దీప్తిని
పునాదిగా మీ పూర్ణత్వానికి..
ఆరు రుతువుల ఆమని నేను
ఆరు రుచులకు కలయిక నేను
ఆకలి కళ్ళకు అన్నం నేను ..
రైతు కంటిలో పంటను నేను
రాగమెత్తిన కోకిల నేను
కవుల మనసులో కావ్యం నేను
పసిడి కలల పంచాంగం నేను !

రచన: డాక్టర్ కాసర్ల నరేశ్ రావు తెలుగు ఉపాధ్యాయుడు, నిజామాబాద్



ప్రకృతి పండుగ

ఉగాది అంటే ప్రకృతి పండుగ
వ్యవసాయమే దండిగా.
కొత్త ఆకులు.
కోరిన పూజలు
గుడిలో జాతరలు
ఇంట్లో పిండి వంటలు
పూల పూల రంగులు
బొబ్బట్ల తీపి రుచులు
పసిడి పచ్చదనాలు
పసందైన పచ్చళ్ళు
మామిడిపందిళ్ళు
మమతల సందిళ్లు..
ఆరు రుచుల ఈ ఉగాది
అందరి పండుగ ఈ ఉగాది..

రచన: కే గాయత్రి (8వ తరగతి), జెడ్పీహెచ్ఎస్, సిర్పూర్



చైత్రపు పులకింత

పులకించిన ప్రకృతి గిలిగింతలే చైత్రం
తొలగించిన వికృతి వెలిగింతలే చైత్రం
శిశిరాలను దాటుకుంటూ
వసంతాలు ఉంటాయి
మురిపించిన సంస్కృతి కౌగిలింతలే చైత్రం
మారే కాలానికి ఆత్మీయ ఆలింగనే ఉగాది
అభ్యుదయ కవిత్వానికి ఆలంబనే ఉగాది
పరివర్తనను స్వాగతించే ప్రగతిశీల కాలమిది
సాంప్రదాయ నౌకలకు చుక్కానే ఉగాది

రచన: చింతల శ్రీనివాస గుప్తా, నిజామాబాద్



మిత్ర దర్శనము

వేప పువ్వు పచ్చడి పంచాంగ శ్రవణము
మిత్ర దర్శనము
ఆర్య పూజనము
గోమాత పూజ ఏరువాక ఆచారాల పాటింపు
మేలు కలయికే ఉగాది
జీవితంలోని కష్టసుఖాల్ని
పంచుకునే పర్వదినం ఉగాది పండుగ

రచన: తిరుమల శ్రీనివాస్ ఆర్య, కవి, నిజామాబాద్



ఆమని సొగసే ఉగాది

మోదుగు పూల పొన్న పైన
ఆమని సొగసే ఉగాది
ఆకురాలు కాలానికి
చిగురు సారె ఉగాది
ప్రకృతి పరిరక్షణయే
మన పండుగ ఇది నిజం
కాలంతో నడుచుటయే
షడ్రుచులకు స్వాగతం
వగరు చేదు జీవితాన
తియ్యని పిలుపే ఉగాది

రచన: డాక్టర్ శారదా హన్మాండ్లు, తెలుగు ఉపాధ్యాయురాలు, నిజామాబాద్.



ఆరంభం

ఆరంభం.. ఆరంభం
నూతన సంవత్సర శుభారంభం
వచ్చింది వచ్చింది ఉగాది పండుగ
తెచ్చింది తెచ్చింది సంతోషాల వెల్లువ
మన జీవితంలో ఉండే
షడ్రుచుల కలయిక.. ఉగాది పచ్చడి
ఒక్కొక్క పదార్థం, ఒక్కొక్క భావానికి,
అనుభవానికి ప్రతీక
గుడిలో పంతుళ్ల పంచాంగ శ్రవణాలు
తెలుగువారి కళ్లలో ఆనందాలు, మమకారాలు
మాటల్లో చెప్పలేని సంతోషాల వెల్లువా
మన ఈ ఉగాది పండుగ

రచన: వి.దివ్యశ్రీ (9వ తరగతి), జెడ్పీహెచ్ఎస్, బోర్గాం (పి)



ఉగాది- జ్ఞాన పునాది

పది కాలాల పాటు పచ్చగా జీవించమని
పసిడి వన్నెతో, పచ్చడి గిన్నెతో
మామిడి రసంతో,
చింతలో తీపి బెల్లాన్ని కలిపి
చకచకమని కదలి వస్తున్న ఉగాది
అజ్ఞానము పంచే బోధల్ని
అహంకారము దించే బాధల్ని
అసూయా సెగలను, ద్వేష పగలను
సమాజంలో అంతమొందించే ఉగాది
షడ్రుచులను ఏకం చేసి
రాగద్వేషాలను సమరసం చేసి,
సమతను మదిలో కలిపే
ఉగాది – జ్ఞాన పునాది

రచన: కొలుకుల రజిత, తెలుగు అధ్యాపకురాలు



న్యూ ఇయర్ దండుగ

ఉగాది వచ్చిందంటే చాలు
మా ఊర్లో జాతరకు వెళ్తాం.
సంబురంగా ఆటలు ఆడతాం.
ఇంట్లో కమ్మని వంటలు
రుచికరమైన పచ్చళ్ళు
మామిడి, చింత,వేప, బెల్లం.
మా ఇంట్లో చుట్టాలవుతాయి..
ఉగాది వచ్చిందంటే చాలు
మా పిల్లలకు మహా పండుగ
దీని ముందు ఇంగ్లీష్
న్యూ ఇయర్ దండుగ !

రచన: యం.హారిణి, 9వ తరగతి, జెడ్పీహెచ్ఎస్, సిర్పూర్



క్రైం కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి మృతి



ఖలీల్‌వాడి: నగరంలోని జీజీహెచ్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి శనివారం తెలిపారు. ఈ నెల 24న రాత్రి 10 గంటల ప్రాంతంలో జీజీహెచ్‌లోని లిఫ్ట్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండడంతో చికిత్స కోసం వార్డులోకి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే ఆ వ్యక్తి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి వివరాలు తెలిస్తే ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్‌కు లేదా 87126 59714 నంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు. మృతదేహాన్ని జీజీహెచ్‌లో ఉంచి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

చోరీకి యత్నించిన ముగ్గురి అరెస్ట్

రుద్రూర్: మండలంలోని రాయకూర్ క్యాంపులో తాళం వేసిన ఇంట్లో చోరీకి యత్నించిన ముగ్గురిని శనివారం మధ్యాహ్నం స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయకూర్ క్యాంపులో దశరథ రామయ్య కుటుంబసభ్యులు కొంతకాలంగా ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఇది గమనించిన దుండగులు శనివారం మధ్యాహ్నం ఇంటి తాళం పగులగొడుతుండగా శబ్దం రావడంతో చుట్టుపక్కలవారు పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. చోరీకి యత్నించిన వారు బోధన్‌కు చెందిన అశోక్, శ్యామల, సునీతగా గుర్తించారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తామని ఎస్సై సాయన్న తెలిపారు.

పసుపు దొంగల అరెస్ట్.. బెయిల్‌పై విడుదల

బాల్కొండ: ముప్కాల్ మండలం నాగంపేట్ గ్రామానికి చెందిన రైతుల పసుపును కల్లాల వద్ద నుంచి దొంగతనం చేసిన ముగ్గురు దొంగలను శనివారం ముప్కాల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై రజనీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగంపేట్ గ్రామంలో కొల్వి ముత్తెన్నకు చెందిన 10 సంచులు, సల్లా సతీశ్‌రెడ్డికి చెందిన 8 సంచుల పసుపును మెండోరా మండలం వెల్కటూర్ తండాకు చెందిన చవాన్ శంకర్, మాలవత్ గంగాధర్, బనావత్ నవీన్ దొంగిలించారు. దొంగిలించిన పసుపును కారులో తరలిస్తుండగా పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. వారి నుంచి సుమారు 9 క్వింటాళ్ల పసుపు, కారును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కోర్టులో హాజరుపర్చగా, సొత్తు రికవరీ కావడంతో నిందితులకు బెయిల్ లభించినట్లు తెలిపారు.

హత్య కేసులో నిందితుడి రిమాండ్

నిజామాబాద్ రూరల్: మహిళ దారుణ హత్య కేసులో నిందితుడు రాజేశ్‌ను శనివారం జిల్లా కోర్టులో ప్రవేశపెట్టినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహమ్మద్ ఆరిఫ్ తెలిపారు. తన తల్లికి చెడు వ్యసనాలు అలవాటు చేస్తుందనే కోపంతో కమలను నగరానికి చెందిన రాజేశ్ ఇటీవల హత్య చేసిన సంగతి తెలిసిందే. కోర్టు ఆదేశాల మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని..

- భర్తను హత్య చేయించిన భార్య




విఠల్ (ఫైల్)

బాన్సువాడ : వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని కట్టుకున్న భర్తను భార్య అంతమొందించింది. వివరాలు ఇలా ఉన్నాయి. బాన్సువాడ మండలం నాగారం గ్రామానికి చెందిన అమృతం విఠల్ (38) అనే వ్యక్తి 20 ఏళ్ల కిత్రం సోమేశ్వర్ గ్రామంలోని మేనమామ కూతురు కాశవ్వను పెళ్లి చేసుకొని ఇల్లరికం వచ్చాడు. మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వీరికి ముగ్గురు కుమార్తెలు కాగా, ఒక్కరికి పెళ్లి అయింది. విఠల్ భార్య కాశవ్వ నాగారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ విషయమై భార్యాభర్తల మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి. విఠల్‌ను అంతమొందిస్తే ఏ గొడవా ఉండదని భావించిన కాశవ్వ అదే గ్రామానికి చెందిన అమృతం విఠల్(నిందితుడు), పుల్కంటి విఠల్‌కు విషయం తెలిపింది. శుక్రవారం రాత్రి విఠల్(మృతుడు)ను పొలం వద్దకు తీసుకెళ్లిన అమృతం విఠల్, పుల్కంటి విఠల్ అతిగా మద్యం తాగించి మెడకు టవల్‌తో గట్టిగా బిగించి, పైపులతో కొట్టి చంపారు. అనంతరం విఠల్ మృతదేహాన్ని కొల్లూర్ సబ్‌స్టేషన్ సమీపంలో బాన్సువాడ-బీర్కూర్ ప్రధాన రహదారిపై పడేసి వెళ్లారు. ఉదయం అటుగా వెళ్తున్న కొందరు చూసి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి అన్న బింగి సాయిలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడి భార్య కాశవ్వ, అమృతం విఠల్, పుల్కంటి విఠల్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా, విఠల్‌ను తామే హత్య చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారని సీఐ అశోక్ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు పంపనున్నట్లు సీఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యాచకురాలు మృతి

కామారెడ్డి క్రైం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యాచకురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. పట్టణంలోని బీడీ వర్కర్స్ కాలనీకి చెందిన వానరాశి గంగమ్మ (50) భిక్షాటన చేస్తూ జీవనం సాగించేది. శుక్రవారం సాయంత్రం రామారెడ్డి రోడ్డులో ఇంటికి నడుచుకుంటూ వెళుతుండగా అదుపుతప్పిన ఓ బైక్ ఆమెను వెనకనుంచి ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమెను జనరల్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. వాహనాన్ని అజాగ్రత్తగా నడిపిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్



రాజంపేట: మండలంలోని ఎల్లారెడ్డి గ్రామ పరిధిలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. ట్రాక్టర్లను రాజంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించి, యజమానులపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అరగొండ సెక్షన్ అధికారి సయ్యద్ బాబా, సలీం, బీట్ అధికారులు శ్రీనివాస్, సురేశ్, పద్మారావ్ పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిని పాటించాలి



మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ ప్రతినిధి శ్రీధర్

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)తెలంగాణ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉగాది ఉత్సవం నిర్వహించారు. క్యాంపస్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఉత్సవానికి ప్రధానవక్తగా యెన్ను శ్రీధర్ హాజరై మాట్లాడారు. యువత పాశ్చాత్య సంస్కృతి వీడి భారతీయ సంస్కృతిని పాటించాలన్నారు. ఉగాది ఉత్సవ ప్రాముఖ్యత తెలుసుకోవాలన్నారు. అకడమిక్ కన్సల్టెంట్ గంగాకిషన్ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ ద్వారా యువతతో దేశభక్తి, క్రమశిక్షణ, సమయపాలన పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.